# ఎలా?

లాయర్ 1-2-91

ఇలాటి ఎలా ?లు

ఎన్నో మనదేశంలో ?

—జయప్రద

ఈ రోజు 1990 నవంబర్ 26వ తారీఖు- సోమవారం, బెంగుళూరుకు శ్రీవారితో ప్రయాణం- అదీ సైక్లోనిక్ వాతావరణంలో మనసు ఎంత ఉల్లాసంగా వుందో! ఇంత ఆనందంలో అపశృతిలా నా మామగారి అమ్మగారి సణుగుడు.

-ఇక్కడుందా బెంగుళూరు? ఎంత ఓపికే నీకు! హాయిగా ఇంట్లో వుండక పసిబిడ్డనొదిలేసీ....

కారు ఖాళీగా వెళుతోందమ్మమ్మా సవినయంగా జవాబు చెప్పాను. కానీ నా మనసులో జవాబు వేరే. ఎక్కడో సైక్లోన్- ఇక్కడ చల్లని

వాతావరణం. ఇంకా స్త పోతే జల్లుజల్లుగా వర్షం పడవచ్చు. కారు అద్దాల మీద పడి విరిగి జారిపోయే వర్షపునీటిని చూసి ఆనందించే అరుదయిన అవకాశాన్ని తను వదులుకుంటుందా? ఆయన బిజినెస్ పనిమీద వెళ్తున్నారు. అదృష్టంకొద్దీ వందిమాగదులు లేరు.

నెల్లూరులో కారు కదిలింది. వేకువఝామున మంచును చీల్చుకుంటూ కదిలింది.

"సార్ మొన్ననే ఫుల్‌టాంక్ చేసాం. కొరవ పట్టించమంటారా డీజల్" అడిగాడు డ్రయివర్ ఏడుకొండలు డీజల్ బంకుదగ్గర కారాపి. శ్రీవారు అటు చూశారు.

"వద్దులే ఇక్కడ బాగా రష్‌గా వుంది. తిరుపతిలోనో, చిత్తూరులోనో పట్టించుకుందాము పోనీ" ఆవళిస్తూ అన్నారు.

నేను వెనుక సీట్లో డోర్ ప్రక్కగా కూర్చుని ప్రకృతిలోకి చూస్తున్నాను. చెట్లు వూగుతున్నాయి, అలా చెట్లు విసురుగా ఊగుతుంటే ఎంత అందంగా వుంటుందో? ఆ ఊగే చెట్లు ఆకులమీద వానతుంపర తెరలు తెరలుగా కారులోకి తడిచిన గాలి నన్ను తడుపుతూ—పులకించి పోతూ నేనూ—

గ్లాసులెత్తేసుకోకూడదు? తడిచి పోవడంలేదూ? మావారు వెనక్కు తిరిగి అన్నారు.

"మీరూ వెనక్కు రండి ఇద్దరం కలిసి స్వర్గంలోకి వెళ్ళిపోదాం" నా ఆశావేదుక గొంతులోనే ఆగిపోయింది గుండెలో నుండి చీల్చుకొని వచ్చి. అడగడం ఎందుకు? కాదనిపించుకోవడం ఎందుకు? ఆయన మనస్సంతా బెంగుళూర్‌లో జరుగుతుందో, జరగదో అనే బిజినెస్ పని మీదే వుంటుంది.

"వర్షం ఎక్కువయితే ఎత్తేస్తాలెండి"

ఆయన నిద్రకు ఉపక్రమించారు. చల్లటి గాలి నన్ను బుజ్జగి స్తోంది.

ఉదయపు కాంతి మేఘాల్లో దాక్కుంటోంది.

ఫ్రంట్‌గ్లాస్ మీద వాలే వర్షపు ధారని వైపర్లు నిర్దాక్షిణ్యంగా తుడిచివేస్తున్నాయి.

గతుకుల రోడ్డుమీద కారు కుంటికడన నడుస్తూ తిరుమలకొండల అద్భుత సౌందర్యం మధ్యలోకొచ్చేసింది. నాకు కాలమే తెలియతేదు. ఆదే ఎండలో అయితే ఈ ప్రయాణం ఎంత బోరో!

"ఆకలిగా లేదూ!" నిద్రలేచి బద్ధకంగా వెనక్కి తిరిగి అడిగారు శ్రీవారు.

కారు మయూరీ హోటల్‌ను సమీపిస్తుండగా—"నాకొద్దు మీరేమైనా తీసుకోండి"

"మీకాకలి లేకపోతే నేరుగా చిత్తూరు వెళదాం బ్రేక్‌ఫాస్ట్‌కి"

ఏడుకొండలు కొద్దిగా తలతిప్పి అన్నాడు...."సార్ డీజిల్ సంగతి"

"చిత్తూరులో పోయించుకుందాములే పోనీ"

మా కొత్త డీజిల్ అంబాసిడర్ స్పీడుగా కదలబోయి ఆశక్తురా లయింది.

"పాపం వెంకటేశ్వరస్వామి సన్నిధిలోనే ఇంత గతుకులరోడ్డా? ఎంత దయనీయం?"

గేర్ మార్చుకొంటూ కారు తిరుపతి దాటింది.

చిత్తూరులో బృందావన్ హోటల్‌లో తృప్తిగా టిఫిన్‌చేసి ఏ మూడ్‌లో వున్నారో వెనక సీట్లో వచ్చి కూర్చుని, ప్యూయెల్ పోయించు కొని—

రోడ్డుబావుంటుందిక త్వరగా బెంగుళూర్ చేర్చు" అని డ్రైవర్కి హుకం జారీచేసారు మావారు.

నేను తడిచిన చీరని సర్దుకునే లోపలే మరలా కాతాగింది.

"డీజిల్ లేదా?" విచారపడ్డారాయన.

"సరే వేరే బంక్‌లో చూడు"

ఆ వేరే బంక్‌లో మరో వేరే బంక్‌లో కూడా దొరకలేదు.

పలమనేరు, కోలార్‌లో కూడా పాపం ప్రయత్నిస్తూనే వున్నారు. నేనేమీ పట్టించుకోవటంలేదు.

నాపాటికి నేను ప్రకృతినాస్వాదిస్తున్నాను. ఇలాంటివి యింటిలో ఎలాగూ తప్పవు.

"కిరసనాయిల్ ఇవ్వలేదమ్మా! గోధుమలు రాలేదటమ్మా! చక్కెరకు రేపు రమ్మన్నాడమ్మా రేషన్ కొట్టతను...." ఇలా....ఇలా.... ఎన్నో రోజుకి....

"నెల్లూరులోనే ఆగి పట్టుకు రావాల్సింది"

"ఫుల్ టాంక్ చేసినా బెంగుళూర్ నుండి తిరిగి రాలేంకదా సార్ కేన్‌లో పట్టుకొనుండాల్సింది సార్"

గాఢంగా నిట్టూర్చారు

"సర్లే సిటీలో దొరక్కపోదు"

నున్నటి కర్నాటక హైవేమీద కారు స్పీడుగా దూసుకుపోతోంది యూకలిప్టస్ గాలిని చీల్చుకుంటూ....

బెంగుళూర్ కామత్‌లో మా భోజనం అయింది.

జె.సి. రోడ్‌లో ఆయన బిజినెస్ వ్యవహారం గంటన్నర్లో పూర్తయింది.

"లాల్‌బాగ్‌లో కాస్సేపు స్పెండ్‌చేసి వెళదామండీ" గోముగా అడిగాను.

టైము రెండయిపోయింది. సిటీలో కూడా దోవలో డీజిల్ దొరక లేదు.

డీజిల్ వెతుక్కొని మూడుకన్నా బయలుదేరితే 11 గంటలకల్లా చేరిపోతాం.

"రోజులు బాగాలేవు సీతా" ఆర్ద్రంపుగా అన్నారాయన.

"సరే మీ ఇష్టం" అసహాయంగా ఒప్పుకున్నాను.

పదేళ్ళక్రితం నాన్నగారితో చూసిన లాల్‌బాగ్ కళ్ళలో మెదులుతోంది.

డీజిల్ వేటలో పడ్డాము.

నాలుగు బంకుల్లో లేదు.

అంతవరకు పని తొందరగా అయిపోయిన ఆనందంతో హాయిగా సీటు వెనక్కి జారగిలబడి రిలాక్సయిన మా పతిదేవుడు ముందుకు వంగి దిగులుగా అన్నారు—

"ఎలానోయ్‌మరి?" పాపం ఆయనకు రేపు నెల్లూరులో అర్జెంట్ పనివుంది.

"మన బండిలో ఆయిల్‌తో చిత్తూరుదాకా వెళ్ళొచ్చు సార్"

"చిత్తూరుదాకా వెళితే ఎలాగా ఏడుకొండలూ? వెరే బంకు ప్రయత్నించు"

"చూస్తాను సార్" దిక్కులు చూసుకుంటూ మెల్లిగా వెళుతోంది కారు.

"అదిగో అక్కడ పడుతున్నట్టున్నారు సార్"

"పోనీపోనీ త్వరగా పోనీ మూడయిపోతోంది టైమ్"

మా వాహనం నేరుగా రాజాలా డీజిల్ టంక్‌లోకి దూరింది.

మా ఏదురుగా పదిమంది చేతులూపుతూ, అరుస్తూ మా కారు మీదకు దండెత్తి వస్తున్నారు.

మొదటలో అరాచకం ఎందుకో అర్థంకాలేదు.

ఆ తర్వాత కొస కనిపించని చాంతాడంతటి వాహనాల క్యూ చూసాక బోధపడింది.

"మేము నిన్నటినుండి క్యూలో వున్నాం. అన్నం, నిద్రలేకుండా మేముంటే... "

"ఇటువచ్చారో లేదో పాపం అయ్యగారికి మొదటిస్థానం కావాల్సొచ్చింది"

రకరకాల భాషల్లో, రకరకాల శృతుల్లో అరుస్తున్నారు డ్రైవర్లు.

కళ్ళు సారించి చూసాను. లారీలు, బస్‌లు, కార్లు ....నిరసంగా నిరసంగా.....

"ఓ గాడ్! డీజిల్ స్కేర్శిటీ క్యూలో వుండాల కాబోలు."

మావారి గుండెల్లో బండరాయి.

నెల్లూరులో ఇలాటివన్నీ మామగారే చూసుకుంటారు. ఈయన బిజినెస్ ఏమిటో ఈయనేమిటో—మరొకటి తెలీదు పాపం.

"ఎంత సేపులెండి సార్ క్యూ కదలాలేగానీ!" ఏడుకొండలు తన యజమానికి ధైర్యంచెప్పి కారు వెనక్కి ఓ రెండు ఫర్లాంగులు తీసుకు వెళ్ళి క్యూలో నిలిపాడు....

"హమ్మయ్య!" అని మేమనుకున్నామో లేదో మరలా డ్రైవర్ వచ్చి మీదపడ్డాడు.

అక్కడ ఒక రోడ్ వుంది. ఆ రోడ్‌లోకి ట్రాఫిక్ పోవడానికి క్యూని అక్కడ సందుల్ంచి ఆపారు. ఆ సందులో దూర్చారు మా డ్రయివర్‌గారు.

"పోనీపోనీ వెనక్కిపోనీ" తన్నడానికొచ్చాడు ఓ ట్రక్కు డ్రయివర్.

మావారు రంగంలోకి దిగారు.

"మాకెంత పది లీటర్లున్నా చాలు. ప్లీజ్! కారులో ఆడవాళ్లున్నారు" అంతలావు డ్రయివర్ కరిగిపోయాడు.

ఆడపుట్టుక ఇందుకన్నా పనికొచ్చింది.

"కంగ్రాచ్యులేషన్స్" మావారిని అభినందించాను.

"ఎక్కడ సీతా! వెనక్కెల్లాలంటే ఇంకెన్ని ఫర్లాంగులు వుందో క్యూ? గడ్డం పట్టుకోక తప్పలేదు" చిన్నగా నవ్వారాయన-ఇందులో కొంత గర్వం, కొంత చిన్మయం.

నిజమే వెనక్కి తిరిగి మెడ నిక్కించి కళ్ళు సారించి చూసినా కొస కనిపించలేదు.

అడ్డరోడ్డులోకి వెళ్ళను కొద్ది స్థలం వదిలి కొద్ది ప్రక్కగా పెట్టాడు కారు ఏడుకొండలు అరగంట తర్వాత ముందు లారీ కొద్దిగా కదిలి ఆగింది. దానితో వెనుక వాహనాలన్నీ ఒక్కడుగు ముందుకు వేసి కొద్దిగా ఆనందించాయి. బస్ డ్రయివర్లంతా హడావుడిగా తిరుగుతున్నారు కొందరు కేన్‌లు, బేరల్స్ పట్టుకొని బంక్ వైపు వెళ్తున్నారు. కొందరు మాలా మధ్యలో దూరినవాళ్ళను గద్దమాయించి వెనక్కునెడుతున్నారు. మరికొందరు బంక్ దగ్గర కెళ్ళి న్యూస్‌లు మోసుకొస్తున్నారు. డీజల్ కావాలంటే కారు తుడిచే మఫత్‌గుడ్డ కొనాలట దాని ఖరీదు బయట నాలుగయితే యిక్కడ ఆరు, మంచి బిజినెస్.

ఇంకా క్యూ కదలలేదేమి?

ఎక్కడ సార్ రెకమండేషన్స్ తోజులివి. వేరల్ని వేరల్స్ పట్టుకుంటున్నారు. గంట చూసుకున్నారు నాలుగయింది.

"విసుగ్గా వుందా? పోనీ ఎక్కడయినా హోటల్‌లో రూము తీసుకుంటాను ఒక్కదానివే వుండగలవా? స్నానం అదీచేస్తే ఫ్రెష్‌గా వుంటుంది."

ఒంటరిగా అక్కడుండేకంటే కారులో వుంటే శ్రీవారి సమక్షమన్నా దొరుకుతుంది. పైగా ఆ దంజన్‌లో కంటే యీ కారు అద్దాల్లోనుండి చిటపట చినుకుల సంగీతం వినొచ్చు అయినా యిట్లాటి అనుభవం దొరకమన్నా దొరుకుతుందా ఏమిటి?

తల అడ్డంగా ఊపాను.

"పోనీ లాల్‌జాగ్‌లో వుంటావా కాసేపు?"

"మీరుంటారా నాతో" ఆశగా అడిగాను.

"నేనుంటే ఎలా? ఏడు కొండలు అక్కడ కేన్‌లో పట్టించుకోడానికి ట్రై చేస్తున్నాడు. నేనిక్కడ క్యూలో కదుల్తుండాలి కదా! చప్పున నిన్ను ఆటోలో దింపేసొస్తాను."

ఉహుఁ వద్దు ఈయన ప్రక్కన లేకుండా స్వర్గంలో కూడా అందాలు కనిపించవు నాకు.

రెండున్నర గంటసేపు క్యూ కదిలాక డీజల్‌పోసే అపురూపమయిన బంక్ కనిపించింది.

అయిదున్నరయింది యిప్పుడు కదిలితే 3-30 అవుతుంది నెల్లూరు చేరను మంచిదికాదు. కాని రేపు పని ఎలా?

"ఏమవుతుంది వెళదాంలెండి" మా బెటర్ హాఫ్‌కి హాఫ్ హార్టెడ్‌గా

త్యం చెప్పాను నేను. కాదన్నా ఆయన మానరు ఆయన బిజినెస్ మెండెడ్.

ఏడుకొండలు రొప్పుకుంటూ వచ్చాడు.

"డీజల్ అయిపోయింది సార్" ఆయాసపడుతూ నీరసంగా చెప్పాడు.

హతోస్మి.

"మీకు డీజల్ కావాలా?" దేవుడు ప్రత్యక్షమయినట్టు ఎదురుగా గైడ్ కుర్రాడు.

"ఆఁ ఓ రూపాయి ఎక్కువయినా ఫర్వాలేదు నీ దగ్గరుందా?" రూపాయి తక్కువ సంగతి ఈయన చెప్పాలా? ఎలాగూ వాడెక్కువ తీసుకోకుండా ఎందుకు పోస్తాడు?

"నా దగ్గర లేదు సార్. నటరాజ థియేటర్ దగ్గర పోస్తున్నారు. నేను తీసుకెళతాను."

"ఎక్క కారెక్క."

కారు చాలా దూరం ప్రయాణంచేసి నటరాజ థియేటర్ దగ్గరున్న డీజల్ బంక్ దగ్గరాగింది అక్కడ క్యూలేదు, డీజలూలేదు. కారు వెనక్కి తిరిగింది. గైడ్ కుర్రాడు పాపం మేమివ్వబోయే పది-పదిహేను రూపాయల కోసం బంకలన్నీ గాలిస్తున్నాడు. అందరూ లేదని చెయ్యి ఊపేవాళ్ళే. పప్పరమెట్లు అమ్ముకునే బంకుల్లో వాళ్ళను కూడా తప్పించలేదు మా వాళ్ళు. యిలాటి డిమేండ్‌తో మారు బేరానికి అమ్ముకుంటారట వాళ్ళు.

ఎట్టకేలకు ఓ బంక్‌లో డీజల్ పోస్తున్నారు. ఈసారి నేరుగా వెళ్ళి క్యూలో నిల్చున్నాం-బంక్ కన్పిస్తుంది. అందరి గుండెలనిండా గాలి పీల్చుకున్నాం. కాన్ పట్టుకుని గైడ్ కుర్రాడు ఇన్‌ఫ్లుయన్స్‌తో బంక్‌లో దూరారు మా వారు. ఫరవాలేదు గ్లాసు తుడిచే గుడ్డ దొరికినట్టే.

వర్షం ఆగింది. ఉక్క ప్రారంభించింది. మరలా ఓ పెద్ద వర్షపు జల్లు పడటానికి సూచన అది ఓ గంట గడిచింది. విసుగ్గా వుంది. మా వారొచ్చారు.

"పోసారా! ఆతృతగా అడిగాను" పోస్తే ఆయనే చెప్పరా?

పోయలేదన్నట్టు పెదవి విరిచారాయన బేరల్స్ నింపుతున్నారట. డిమేండ్ లేనప్పుడు హడావిడిగా వచ్చి పట్టే వర్కర్స్ నిదానంగా, విసుగ్గా పడుతున్నారట. ఇంతా చేస్తే రెండు వాహనాలకి మాత్రం పట్టారట. అవి వెనక్కి కదలడానికి దారిలేకుండా అడ్డంగా చేరే లారీలవాళ్ళు పెట్టారట. దాంతో క్యూ కదలడంలేదట ఇదీ వార్త.

ఒక్కో లారీవాడు నూటబిల్లర లీటర్లు పట్టుకుంటున్నారు. మన చాన్స్ వచ్చేసరికి అయిపోతుందేమోనని టెంషన్‌గా వుంది. డీజల్ పట్టేసుకుంటే నిదానంగా రేపయినా కదలొచ్చు. ఆ స్థితి కొచ్చారు ఆయన.

సార్ అందరూ మొదట డబ్బుకట్టి బిల్స్ తీసుకుంటున్నారు. మీరూ రండిసార్ మా పతిదేవులు ఇంచుమించు పరుగెట్టారు ఏడుకొండలు వెనుక.

ఈయన పుస్తకం కొనిస్తానంటే తెలుగు పుస్తకం కోసం ఎన్ని కర్ణాటక పుస్తకాల షాపులు తిరగాలోనని జాలిపడి వద్దన్నానుగానీ పుస్తకమన్నా లేకుండా విసుగ్గా వుంది. ఈ బంక్ యజమాని ఎవరో కొద్దిగా కూడా ఈస్థటిక్ సెన్స్ వున్నట్టులేదు. యిక్కడ నుండి ఎంతో తొంగి చూసినా ఓ సుందర దృశ్యమూ కన్పించడంలేదు పైగా ఒళ్ళంతా చమట.

నేనిలా ఎంతోసేపు బాధపడకముందే తలలు వేలాడేసుకుని అయ్యగారూ, డ్రయివరుగారూ ఉత్త కేన్‌తో వచ్చారు.

గైడ్ కుర్రాడేడీ? అడిగాను.

"వాడి మొహం మేము పోయించుకుంటే పది రూపాయల చెయ్యి చాచడం తప్ప వాడికేం తెలియదు... హుష్ అబ్బా ఉక్క ఆఁ ఇంకెందుకు? మైసూర్‌రోడ్‌కి పోనీ" స్వగతం పరాగతం రెండూ చేసి, ఉసూరుమంటూ ముందు సీట్లో కూర్చున్నారు.

అందమైన, విశాలమైన మైసూర్‌రోడ్ మీద చాలా దూరం ప్రయాణం చేసాక బంక్ అయితే వుందికానీ అందులో జవాబుచెప్పే నాధుడు కూడా లేడు.

గాఢ నిట్టూర్పులు వదిలి వెనక్కు తిరిగాం అండర్ బ్రిడ్జి దగ్గర హటాత్తుగా కారాగింది.

ఏమైంది? వచ్చేటప్పుడు కారు చూపించుకురాలా? 'అంతా బాగుందన్నాడు సార్ మన మెకానిక్' వుండండి చూస్తాను దిగి బోనెట్ ఎత్తి అదీ ఇదీ కలియబెట్టి చావు వార్త చల్లగా చెప్పాడు.

ఏమీలేదుసార్ డీజల్ అయిపోయింది.

"చిత్తూరుదాకా వస్తుందరిటివే"

ఇక్కడ చాలా తిరిగాంకదా సార్ డీజల్ కోసం చిత్తూరుదాకా వెళ్ళిపోయినా పోయేది ఆంధ్రాలో దొరకదేమో పశ్చాత్తాపపడుతున్నారీయన. నాకు హటాత్తుగా టివిలో గవర్నమెంటువారి హెచ్చరిక గుర్తు వచ్చింది.

"దయచేసి ఆయిల్‌ని ఆదా చేయండి. అది తల్చుకుంటేఇప్పుడు నాకు నవ్వొచ్చింది. డీజల్ డిమేండ్‌లో ఆయిల్ బంక్‌ను వెతుక్కుంటూ

వెళ్ళను ఎక్స్ట్రా ఆయిల్ కావద్దా మరి అదా చెయ్యటం యేలా?" చిక్కు ప్రశ్న-

ఇంటికెళ్ళగానే మొదట దీనికి జవాబు కోసం దూరదర్శన్‌కి ఉత్తరం వ్రాయాలి.

*